211) దేసాళం

ప॥ భావించలే రెవ్వరును బయలువాకేరుగాని। నీవే గుఱుతు మాకు నీరజనాభ॥

చ॥ కైవల్య మెట్టుండునో నిక్కపుజ్ఞాన మెట్టుండునో। దైవిక మెట్టుండునో తలచరాదు।
జీవన మెట్లుండునో చిత్తమేరీతినుండునో। ఆవిధ మెవ్వరి కిట్టిట్టనగరాదు॥

చ॥ వేదము లెట్టుండునో విరతి యెట్టుండునో। ఆది నంత మెట్టుండునో అరయరాదు।
భేద మనే దెట్లుండునో అభేద  మది యెట్టుండునో। సోదించి యెవ్వరికిని చూడగరాదు॥

చ॥ ఫల మెట్లానుండునో భక్తి యెట్లానుండునో। తెలివి యెట్టుండునో సాధించగరాదు।
యిలపై శ్రీవేంకటేశ యిటు నీశరణుచొచ్చి। నిలుకడై వున్నారము నీకృప యికను॥